భూసేకరణ పనులు వేగవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

భూసేకరణ, ఇరిగేషన్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

నాగర్‌కర్నూల్, జనవరి 24 : ఇరిగేషన్, జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇరిగేషన్, రెవెన్యూ, జాతీయ రహదారి ఇంజినీర్లు, అధికారులతో భూసేకరణ, ఇరిగేషన్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ, పాలమూరు రంగారెడ్డి, ఉమామహేశ్వర రిజర్వాయర్, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, జాతీయ రహదారి పనులకు సంబంధించి భూసేకరణ కారణంగా నిలిచిపోయిన పనులు, పునరావాస కేంద్రాల పురోభివృద్ధి, ఇతరత్రా సమస్యలపై చర్చించి పలుసూచనలు చేశారు. పబ్లికేషన్స్, అడ్మిన్‌కు సంబంధించిన బడ్జెట్ ఈఎన్‌సీ నుంచి విడుదల చేయించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించి ప్యాకేజీ-29 కింద అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్యాకేజీ 30కి సంబంధించి డీపీఆర్ ప్రకారం ఆమోదిత అలైన్‌మెంట్ మేరకు పనులు కొనసాగించాలని సూచించారు. మార్కండేయ రిజర్వాయర్‌పై సమీక్షిస్తూ భూసేకరణ పనులు పీఎన్ స్టేజ్‌లో ఉన్నవాటిని అవార్డ్ స్టేజ్‌కి తీసుకురావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న ముంపు బాధితులకోసం వారికి దగ్గరగా ఉన్న నల్లగొండ జిల్లాలో పునరావాసం కల్పించేందుకు స్థలం కేటాయిస్తే ముంపు బాధితులతో మాట్లాడి తరలించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో నల్లగొండ కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లాకు సంబంధించిన ఇరిగేషన్ ఈ.ఈకి సూచించారు. అలాగే కల్వకుర్తి నుంచి నంద్యాలకు వెళ్లే జాతీయ రహదారి జిల్లాలో 79.3 కిలోమీటర్ల మేరకు సాగనున్న రహదారి విస్తరణ పనులకు భూమి 110 హెక్టార్లు కాగా, ఇంకా కావాల్సిన 50 హెక్టార్ల భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు మంజూరైన జాతీయ రహదారి వివిధ ప్రాజెక్టుల భూసేకరణ ఇతరత్రా పనుల విషయంలో ఎప్పటికప్పుడు రెవెన్యూ, ఇరిగేషన్, జాతీయ రహదారి శాఖల అధికారులు తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రాంరెడ్డి, శ్రీనివాసులు, గోపిరామ్, నాగరాజు, ఇరిగేషన్ ఈఈలు మురళి, సంజీవరావు, ఈఈ కల్వకుర్తి రాజేందర్, డీపీఆర్‌వో సీతారాం పాల్గొన్నారు.

జంతు సంక్షేమం అందరి బాధ్యత: కలెక్టర్

నాగర్‌కర్నూల్, జనవరి 24: జంతు సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జంతు సంక్షేమ చట్టాలను విధిగా పాటించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం జంతు సంరక్షణ కోసం పాటించాల్సిన నిబంధనల కరపత్రాన్ని విడుదల చేశారు. ప్రజలు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. వీధుల్లో తిరిగే కుక్కలు, పిల్లలు, ఆవులు తదితర జంతువులపై కరుణతో వ్యవహరించాలని, వాటికి ఆహారం, తాగునీరు అందించాలని, హింసకు గురి చేయవద్దాన్నారు.కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రమేశ్ పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 24: ఎస్సీ కార్పొరేషన్‌లో బోగస్ ఏజెన్సీల పేరిట ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాసులు, గీత, అశోక్, తారాసింగ్, కాశన్న ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందాం

- మండల సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, జనవరి 24 : పార్టీలకతీతంగా మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ భీమమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశం సర్పంచుల పదవీ నెలాఖరులో పూర్తవుతున్న నేపథ్యంలో సమస్యలకు తావివ్వకుండా కేవలం సర్పంచుల అనుభవాలను నెమరువేసుకున్నారు. అనంతరం సర్పంచులను సన్మానించారు. సమావేశం ప్రారంభం కాగానే వివిధ గ్రామాల సర్పంచులు వారి అనుభవాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలం కావడంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ఆయన సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని సర్వారెడ్డిపల్లి నుంచి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు వున్న రోడ్డును డబుల్‌రోడ్డుకు మార్చేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఉల్పర వద్ద దుంధుభీపై వంతెన నిర్మాణం కోసం రూ.5కోట్లు మంజూరు కావడంతో పాటు రంగాపూర్‌లో డ్రైనేజీ మరమ్మతుల కోసం రూ.3.5 కోట్లు మంజూరు చేసిన సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. రూ.100 కోట్లతో మండలాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కొండారెడ్డిపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.35 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం సర్పంచులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంధ్య, సింగిల్‌విండో చైర్మన్లు సురేందర్‌రెడ్డి, గురువయ్యగౌడ్, జెడ్పీ కో-ఆప్షన్ హమీద్, తాసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవో శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు

అచ్చంపేటరూరల్, జనవరి 24: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా అచ్చంపేటకు రూ.25 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం స్కిల్ డెవలఫ్‌మెంట్ సెంటర్ మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. బుధవారం ఎన్‌టీఆర్ స్టేడియం సమీపంలో ఆర్డీవో, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో పాటు ఎమ్మెల్యే స్థలపరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపిరామ్, కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు ఉన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

బాలికలు ఆత్మస్థైర్యంతో రాణిస్తారు

బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

నాగర్‌కర్నూల్, జనవరి 24: బాలికల రక్షణ అందరి బాధ్యత అని, బాలికలకు అవకాశాలు కల్పిస్తే ఆకాశమే హద్దుగా ఎదిగి ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణిస్తారని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ క్రీడా మైదానంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా శిశుసంక్షేమ, విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కస్తుర్బా బాలికల విద్యాలయాల విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలికా సంరక్షణతోపాటు సాధికారత కల్పించే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో బాలబాలికల మధ్య తేడాలు చూపొద్దన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్, టెన్నికోర్ట్ బహుమతి సాధించిన తాడూరు, లింగాల, పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల కేజీబీవీ విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ గణాంకాధికారి మధుసూదన్‌రెడ్డి, కేజీబీవీల పర్యవేక్షణ అధికారి చైతన్య, వీహబ్ ఉమెన్ జిల్లా కోఆర్డినేటర్ శ్వేత, జిల్లా క్రీడల అధికారి సీతారాం, డీసీపీవో చైర్మన్ లక్ష్మణ్‌రావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు పాల్గొన్నారు.

క్రీడలు.. ప్రతి విద్యార్థికి అవసరం

- జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి సీతారాం

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 24 : క్రీడలు ప్రతి విద్యార్థికి అవసరమని జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు చదువుతో పాటు తప్పనిసరి అని, క్రీడలను ప్రోత్సహించడం ద్వారా వారిలో నైపుణ్యాలను వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా, అధ్యాపకులు షేక్ ఖాజాబీ, కోదండరాములు, వనిత, ఉమాదేవి, ముజఫర్, దశరథం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే

కల్వకుర్తిలో డ్రైవర్‌ను సన్మానిస్తున్న డీఎం, ఉద్యోగులు

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : ప్రయాణికులను సురక్షితంగా తమతమ గమ్యస్థానాలకు చేరవేయడంలో డ్రైవర్లపాత్ర చాలా కీలకమని టీఎస్ ఆర్టీసీ డీఎం సుభాషిణి అన్నారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్‌లో డ్రైవర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. అనంతరం 30 ఏండ్లుగా ఎలాంటి ప్రమాదాలు చేయకుండా సేవలందిస్తున్న డ్రైవర్ అంజయ్యను సన్మానించారు. కార్యక్రమంలో శ్వేత, ఏపీరెడ్డి ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్, జనవరి 24: నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక బస్టాండ్‌లో డిపో మేనేజర్ దేవరాజు ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థినులు, ప్రయాణికులచే డ్రైవర్లకు గులాబీ పూలను అందించి, హ్యాపీ జర్నీ అని చెప్పడంతో డ్రైవర్లు సంబురపడ్డారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో కస్తుర్బా పాఠశాలల విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది.

నాగర్‌కర్నూల్‌లో డ్రైవర్లకు పువ్వులు అందిస్తున్న విద్యార్థినులు

శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అమ్రాబాద్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధారాణి

అమ్రాబాద్, జనవరి 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధారాణి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలు సమాజంలో ధైర్యంగా నిలబడాలని, ప్రతి బాలిక అబ్బాయిలతో సమానంగా ఎదగాలని తెలిపారు. కళాశాల బృందానికి, విద్యార్థినులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా బాలికల దినోత్సవం

బిజినేపల్లి, జనవరి 24: శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండగలుగుతామని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సాధికారత, ప్రాధాన్యం గురించి వివరించారు.

జననాయక్ కర్పూరి ఠాకూర్‌కు నివాళి

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 24 : బీహార్ మాజీ సీఎం, దివంగత నేత కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం హర్షణీయమని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం ఉన్నారు.

ఘనంగా కర్పూర్ ఠాకూర్ జయంతి

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : భారతరత్న కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో నాయీబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సీఎం లాలుప్రసాద్ యాదవ్, సీఎం నితీశ్‌కుమార్‌కు రాజకీయ గురువుగా వ్యవహరించారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, రాజేందర్, సంఘం అధ్యక్షుడు మురళి, విజయ్‌భాస్కర్, శ్యాం, రవీందర్, జంగయ్య, ఉన్నారు

నాగర్‌కర్నూల్‌లో ఠాకూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థుల్లో రక్తహీనత నివారణే లక్ష్యం

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 24: విద్యార్థుల్లో రక్తహీనత నివారణ లక్ష్యంగా ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం అమలు చేస్తున్నామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల లో రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్ష చేసి గుర్తించా రు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించా రు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఉపాధ్యాయులతో శ్రీజ

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్ మాండ్యలో గురువారం నుంచి జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థిని శ్రీజ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హర్షఖాతూమ్, పీఈటీ సునీత బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

ఊర్కొండ, జనవరి 24 : మండల కేంద్రంలోని యాదయ్య మంగళవారం మృతి చెందగా, విషయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జనార్దన్‌రెడ్డి తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంటనే నాయకుల ద్వారా రూ.5వేలు, పంచాయతీ నుంచి రూ.5వేలను సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజయ్య, ఎంజేఆర్ ద్వారా ఆర్థికసాయం అందజేశారు.

వెల్దండలో..

వెల్దండ, జనవరి 24 : మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన శ్రీనువాసులు వంగూరు మండలం కిష్టంపల్లి గేటు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం కొట్ర గ్రామ సేవాసమితి ఆధ్వర్యంలో పరామర్శించి రూ.5వేలు, మాజీ సర్పంచ్ బాలస్వామి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రవీందర్ రావు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

అచ్చంపేటటౌన్, జనవరి 24: అచ్చంపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో నేడు(గురువారం) వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 11 వాహనాలకు అచ్చంపేట ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉన్న తాధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటలో ఆసక్తిగల వారు 2వీలర్ వాహనాలకు రూ.5వేలు, 4వీలర్ వాహనాలకు రూ.20 వేలు ప్రవేశ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెద్దకొత్తపల్లి, జనవరి 24: జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థులు రాణించాలని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. విజేత జట్లకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని హెచ్.ఎం మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆగ్రో రైతుసేవా కేంద్రం తనిఖీ

కొల్లాపూర్, జనవరి 24: పట్టణంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రాన్ని తాసీల్దార్ శ్రీకాంత్, వ్యవసాయాధికారి నాగరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఆదేశానుసారం ఆగ్రో రైతు సేవా కేంద్రంలో స్టాక్ రిజిస్టర్లు, లైసెన్స్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తనిఖీ నివేదికను కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారికి పంపుతామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బిజినేపల్లి, జనవరి 24: మండలంలోని వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా పాలెం దవాఖాన ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, సురేందర్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అచ్చంపేట రూరల్, జనవరి 24: మండలంలోని బొమ్మనపల్లిలో బుధవారం సర్పంచ్ బోడ్కానాయక్ అధ్యక్షతన రచ్చబండ వద్ద ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. కళాకారుడు రమేశ్‌బాబు క్షేత్రస్థాయిలో బ్యాంక్ లావాదేవీలు చేయువిధానం, వినియోగదారుడికి గల సంబంధం, ఆర్థిక లావాదేవీల విషయాలపై కళా ప్రదర్శన ఇచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్, జనవరి 24: కొల్లాపూర్ ఆర్టీసీ డిపోలో గురువారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ఫోన్ ద్వారా రవాణా పరమైన సమస్యలపై చర్చించనున్నట్లు డీఎం ఉమాశంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. తగిన సూచనలు చేయాలనుకునే డిపో పరిధిలోని ప్రజలు సెల్ నెంబర్ 90004 05878కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : ఆర్టీసీ డిపోలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు డీఎం సుభాషిని బుధవారం ప్రకటనలో కోరారు. నేడు మధ్యాహ్నం 12గంటల నుంచి 1.00 వర కు నిర్వహించే డయల్‌డీఎంలో ప్రయాణికులు సలహాలు, సూచనలు 9959226292 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

అంజన్న బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, జనవరి 24 : మండలంలోని ఊర్కొండపేట అటభయ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బ్రహ్మోత్సవాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుంచి 10వరకు ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. 5న తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ బాలికల గురుకులంపై విచారణకు వినతి

కొల్లాపూర్, జనవరి 24: కొల్లాపూర్ మైనార్టీ బాలికల పాఠశాల/కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినిని, అక్కడి వాచ్‌మెన్ కిడ్నాప్ చేసిన ఘటనపై విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ కొల్లాపూర్ మండల అధ్యక్షుడు యూసుఫ్ బుధవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థినులు చదువుకుంటున్న కళాశాలలో ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం, నిరంజన్, దర్వేశ్, జలీల్ అనే వ్యక్తులు నైట్ వాచ్‌మెన్‌గా కొనసాగుతుండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, వెంటనే పురుష నైట్‌వాచ్ మెన్లను విధుల నుంచి తొలగించాలని వినతిపత్రంలో కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

పెంట్లవెల్లి, జనవరి 24: ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రామయ్య ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల చివరినాటికి గ్రామ సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నదని, కావున కార్యదర్శుల పాత్రపై ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో భరత్ తదితరులు ఉన్నారు.

చెంచుపెంటలను పరిశీలించిన ఎంపీడీవో

అమ్రాబాద్, జనవరి 24: మండలంలోని చెంచులకు అన్ని వసతులు, సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి జన్మన్ కార్యక్రమంలో భాగంగా చెంచుపెంటలను పరిశీలించినట్లు ఎంపీడీవో రామ్మోహన్ తెలిపారు. బుధవారం మండలంలోని కొల్లంపెంట హాబిటేషన్ ఆఫ్ కొత్తపల్లి, కొమ్మనిపెంట హాబిటేషన్ ఆఫ్ అమ్రాబాద్ చెంచుపెంటలను స్థానిక ఏఈ, పీఆర్‌ల పర్యవేక్షణలో పరిశీలించారు. అక్కడ కావాల్సిన వసతుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. చెంచు గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించుటకు సుమారుగా 11.30 కిలోమీటర్ల రోడ్డు అవసరం ఉందని కొలతల ద్వారా గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటయ్య, ఏఈ రుక్మాంగద, కార్యదర్శి మల్లేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇసుక విక్రయం

తిమ్మాజిపేట, జనవరి 24 : మండలంలో గురువారం నుంచి కొత్త ఇసుక పాలసీని ప్రారంభిస్తున్నట్లు తాసీల్దార్ మోహన్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఆవంచ వద్ద రెండు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇద్దరు అధికారులను ఇసుక రీచ్‌ల వద్ద నియమించినట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

తాడూరు, జనవరి 24 : మండలంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఎన్ఆర్ఐ ఈజీఎస్ నిధుల్లో కొత్త పనులను గుర్తించి గ్రామాభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో గంగమోహన్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దు

తిమ్మాజిపేట, జనవరి 24 : మండల కేంద్రంలోని కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు వివిధ రకాల ముగ్గులు, బొమ్మలు వేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బాలికల రక్షణ గురించి జిల్లా మహిళా సభ్యురాలు సునీత వివరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో సుజాత, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్‌సిస్టం వితరణ

వెల్దండ, జనవరి 24 : అజిలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామ నాయకులు రమేశ్‌గౌడ్ దాదాపు రూ.15వేల విలువ చేసే సౌండ్ సిస్టం బాక్సులు, మౌత్ స్పీకర్లు సమకూర్చారు. దీంతో బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వాటిని ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మ